క్లుప్తంగా

లారీ ఢీకొని విద్యుత్తు ఫోల్ ధ్వంసం

కొల్లూరు : లారీ ఢీకొని విద్యుత్తు పోల్ ధ్వంసమైన ఘటన కొల్లూరు కరకట్ట దిగువన చోటు చేసుకుంది. కొల్లూరు సమీపంలో నిర్వహిస్తున్న ఇటుకరాయి కల్లాల్లోకి బొగ్గు సరఫరా చేసే ఇటుక లారీలు నిత్యం కరకట్ట దిగువన బారులు తీరి నిలిపి ఉంటాయి. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి విద్యుత్తు స్తంభాన్ని ఓ లారీ ఢీకొనడంతో సిమెంటు విద్యుత్తు పోల్ ధ్వంసమైంది. విద్యుత్తు పోల్ కూలిపోయే ప్రమాదం ఉండటంతో అప్రమత్తమైన విద్యుత్తు సిబ్బంది విద్యుత్తు సరఫరాను నిలిపివేసి కొత్త పోల్ ఏర్పాటు చేసి సరఫరాను తిరిగి పునరుద్ధరించారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

కొల్లూరు : అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవీందర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పెసర్లంక కృష్ణానది నుంచి అక్రమంగా ట్రాక్టర్ల ద్వారా ఇసుక రవాణా జరుగుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు నిఘా పెట్టారు. శనివారం తెల్లవారు జామును 3 ఇసుక ట్రాక్టర్లు ఇసుకతో వెళుతుండగా గమనించిన ఎస్సై వాటిని అడ్డగించి కొల్లూరు పోలీసు స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

ఎన్‌సీసీ విద్యార్థినికి అరుదైన గౌరవం



కర్లపాలెం: చింతాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన ఎన్‌సీసీ విద్యార్థి పి.అనూరాధారెడ్డి 2023–24 సంవత్సరానికి గానూ బెస్ట్ ఎన్‌సీసీ క్యాడెట్ అవార్డును అందుకుంది. చింతాయపాలెం ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.గోపి తెలిపిన వివరాల మేరకు పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థి గత సంవత్సరం నవంబర్ నెలలో తెలంగాణా రాష్ట్రంలో జరిగిన ఐజీసీ, ఆర్‌డీసీ రాష్ట్ర స్థాయి ఎన్‌సీసీ క్యాంపులో పాల్గొని బాలికల విభాగంలో మెరుగైన ప్రతిభ కనబరించిందని తెలిపారు. ఈ మేరకు డీజీ సికింద్రాబాద్ ఆఫీస్ ఎన్‌సీసీ అధికారులు అనూరాధను బెస్ట్ క్యాడెట్‌గా ప్రకటించారు. దీంతో శనివారం తెనాలి ఐతానగర్‌లోని 22ఎ ఎన్‌సీసీ బెటాలియన్ నందు మేజర్ మనోజ్‌కుమార్ అనూరాధారెడ్డికి ప్రశంసా పత్రం, నగదు బహుమతి చెక్కును అందజేశారని తెలిపారు.

రోగులకు ఆర్థిక సాయం



బాపట్ల: అనారోగ్యంతో బాధ పడుతున్న నలుగురు వ్యక్తులకు సర్పంచ్‌ల సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు గుం(డెడ్డి శివ ఆర్థిక సాయం అందించారు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న పలువురు అనారోగ్యం బారిన పడటంతో గుం(డెడ్డి శివ ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున నలుగురికి ఆర్థిక సాయం అందించారు. బత్తుల పున్నయ్య వెంగళ్‌విహార్‌లో ముగ్గురికి సాయం అందించారు. ఈ కార్యక్రమంలో చందు, అశోక్, తేజ పాల్గొన్నారు.

ప్రియుడితో కలిసి భర్తను హతమార్చిన భార్య



హత్యకు గురైన ప్రేమ్‌కుమార్(ఫైల్)

పట్నంబజారు: వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని ప్రియుడితో కలలలసి భర్తను హతమార్చిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాలు.. బుచ్చయ్యతోటలో నివాసం ఉండే కుక్కమూరి ప్రేమ్‌కుమార్(30) ఆర్టీసీ బస్టాండ్ వద్ద పండ్ల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో ప్రకాశం జిల్లాకు చెందిన ప్రేమ్‌కుమార్, అతడి భార్య భారతితో కలసి మూడేళ్ల క్రితం గుంటూరు వచ్చి బుచ్చయ్యతోటలో నివాసం ఉంటున్నారు. ఈనేపథ్యంలో భారతి లాలాపేట ప్రాంతానికి చెందిన గౌస్ అనే వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. గుర్తించిన ప్రేమ్‌కుమార్ పలు మార్లు భారతిని వారించాడు. అయితే వివాహేతర సంబంధానికి భర్త అడ్డు వస్తున్నాడని, అతడి హతమార్చేందుకు సిద్ధమయ్యారు. గతనెల 28వ తేదీన గౌస్, ప్రేమ్‌కుమార్‌ను మద్యం తాగుదామని చెప్పి తీసుకెళ్లి, వట్టిచెరుకూరు మండలం కొర్నెపాడు ఖాళీ స్థలంలో మరో ఇద్దరితో కలసి హతమార్చాడు. అయితే తన భర్తను హతమార్చాలని భారతి, గౌస్‌ను కోరడంతో పక్కా ప్లాన్ చేసుకుని హత్య చేశారు. అనంతరం 28వ తేదీ రాత్రి తన భర్త కనిపించడం లేదంటూ భారతి కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు కాల్ డేటా ఆధారంగా భారతి, గౌస్‌తో పలు మార్లు ఫోన్ మాట్లాడడాన్ని గుర్తించిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా, నేరాన్ని అంగీకరించినట్లు తెలిపారు. అయితే భారతి, హత్యకు పాల్పడిన గౌస్ పోలీసులు అదుపులో ఉన్నట్లు సమాచారం. మరో ఇద్దరు నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరికలు

బాపట్ల: వైఎస్సార్ సీపీకి రోజురోజుకూ ప్రజాదరణ పెరుగుతోందని ఎమ్మెల్యే అభ్యర్థి కోన రఘుపతి పేర్కొన్నారు. పార్టీ రాష్ట్ర యువజన కార్యదర్శి కూనపురెడ్డి అవినాష్‌నాయుడు ఆధ్వర్యంలో ఎ్రటావారిపాలెంకు చెందిన టీడీపీ బూత్ కన్వీనర్ చంద్రశేఖర్‌తో పాటు పలువురు ఎమ్మెల్యే కోన రఘుపతి సమక్షంలో శనివారం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కోన రఘుపతి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గవిని కృష్ణమూర్తి, కొక్కిలిగడ్డ చెంచయ్య, శాయిల మురళీ, కటికల యోహోషువా, నర్రావుల వెంకట్రావు ఉన్నారు.



టీడీపీ వర్గీయులతో కోన రఘుపతి

పెదమట్లపూడికి చెందిన 50 మంది టీడీపీ కార్యకర్తలు చేరిక

నగరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై టీడీపీ నాయకులు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం పెదమట్లపూడి గ్రామానికి చెందిన 50 మంది టీడీపీ కార్యకర్తలు, ఏలేటిపాలెంకు చెందిన జనసేన నాయకుడు గంటా శ్రీనివాసరావు వైఎస్సార్ సీపీలో చేరారు. కుల,మత రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడంతో లబ్ధి పొందిన ఇతర పార్టీల నాయకులు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని శ్రీకృష్ణయ్య అన్నారు. సార్వత్రిక ఎన్నికలలో వైఎస్సార్ సీపీ అఖండ విజయాన్ని సాధిస్తుందని జోస్యం చెప్పారు. టీడీపీ, జనసేన నాయకులకు ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య, వైఎస్సార్ సీపీ నాయకుడు మోపిదేవి హరినాధబాబు వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ప్రసాదం వాసుదేవ, కోటేశ్వరావు, జాఫర్, రాఘవరావు, రాజబాబు పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎంపీపీ శ్రీకృష్ణయ్య, నాయకులు



జనసేన నాయకుడు శ్రీనివాసరావుకు వైఎస్సార్ సీపీ కండువా కప్పుతున్న, శ్రీకృష్ణయ్య

చంద్రబాబుది మోసపూరిత మేనిఫెస్టో

- ఆయన హామీలను నమ్మే స్థితిలో జనం లేరు
- సీఎం వైఎస్ జగన్ పాలనతోనే పేదలకు న్యాయం
- వేమూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు
- అమర్తలూరు మండలంలోని తురుమిళ్ల, కోడితాడి పర్రు, మోపర్రు గ్రామాల్లో జోరుగా ఎన్నికల ప్రచారం

మోపర్రు(వేమూరు): ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబం లబ్ధిబి పొందడం జరిగిందని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్ బాబు చెప్పారు. అమర్తలూరు మండలంలోని తురుమిళ్ల, కోడితాడిపర్రు, మోపర్రు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు పార్టీ, కులం, మతం చూడకుండా అందించడం జరిగిందన్నారు. మళ్లీ ఆయన ముఖ్యమంత్రి అయితేనే సంక్షేమ పథకాలు ప్రతి ఇంటి ముందుకు వస్తాయన్నారు. చంద్రబాబు మేనిఫెస్టో మోసపూరితమైందని దీనిని ప్రజలు విశ్వసించరని అన్నారు. 2014 సార్వత్రిక ఎన్నికల్లో రైతుల రుణాలు మాఫీ చేస్తానని వాగ్దానం చేసి నెరవేర్చలేక పోయాడని అన్నారు. డ్వాక్రా మహిళల రుణాలు మాఫీ చేస్తానని చెప్పి మోసగించారని అన్నారు. ప్రతి ఇంటికి ఉద్యోగం కల్పిస్తానని, నిరుద్యోగ భృతి ఇస్తానని భూటకపు హామీలను ఇచ్చి నెరవేర్చలేక పోయారని ఎద్దేవా చేశారు. మళ్లీ ప్రజలను మోసం చేసేందుకు మోసపూరితమైన మేనిఫెస్టో ప్రకటించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు మోదుగల యలవర్తి నరేష్, ఎంపీపీ నరేంద్ర, అంబటి రామ్మోహనరావు, గ్రామ సర్పంచ్ కొండపల్లి కిరణ్, మోదుకూరి హరిబాబు, గన్నేపూడి అజయ్ బాబు, కొండ పల్లి వినయ్, షేక్ హుస్సేన్ వలీ, దొప్పలపూడి రవిరాజా, గోవతాటి ఏసోబు, జనమాల పవన్, కొసరాజు వెంకటేశ్వర్లు, కోళ్లమూడి అశోక్‌కుమార్, ముక్కాల గిరి, గుర్ర మధుసూదనరావు, తిక్కశెట్టి శ్రీనివాసరావు, పేర్ల వెంకట సుబ్బయ్య, దారా శ్రీనివాసరావు, రమాదేవి, కృష్ణమూర్తి, శ్రీనివాసరరావు, గోపి, రత్నంబాబు, పున్నారావు, ఏడుకొండలు, నాగ పార్వతి, మాజీ జెడ్పీటీసీ విష్ణుమొలకల వెంకటేశ్వరావు, విష్ణుమొలకల వెంకట రెడ్డయ్య, గోపాలం రాము, అవుతు వెంకటరమణ రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో ప్రసంగిస్తున్న అశోక్‌బాబు



బసవపున్నారెడ్డిని సన్మానిస్తున్న వేణుగోపాలరెడ్డి, అశోక్‌బాబు

చంద్రబాబుది బూటకపు మేనిఫెస్టో

అమృతలూరు(భట్టిప్రోలు): బూటకపు మేనిఫెస్టోతో ప్రజలను మళ్లీ మోసం చేసేందుకు చంద్రబాబు సిద్ధమయ్యారని బాపట్ల పార్లమెంట్ పరిశీలకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి అన్నారు. వేమూరు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులుగా నియమితులైన మోదుగుల బసవపున్నారెడ్డితో కలిసి వేణుగోపాలరెడ్డి అమృతలూరు మండలం కూచిపూడిలోని వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబును కలసి పార్టీ స్థితిగతులపై సమీక్షించారు. ఈ సందర్భంగా వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబుకు ఎన్నికలకు ముందు మాత్రమే ప్రజా సంక్షేమం గుర్తుకు వస్తుందన్నారు. 2014లో చంద్రబాబు 600 హామీలు ఇచ్చి వాటిని నెరవేర్చకుండా మోసం చేసిన విషయాన్ని ప్రజలు మరచిపోలేదన్నారు. బసవపున్నారెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 98 శాతం ఎన్నికల హామీలను అమలు చేశారన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే కొన్నింటికి పరిధిని పెంచి ఇటీవల కొత్త మేనిఫెస్టోను ప్రకటించారన్నారు.

ఆచరణాత్మకమైన విధంగా వైఎస్సార్ సీపీ మేనిఫెస్టో ఉందని అన్నారు. బసవపున్నారెడ్డిని శాలువాతో వేణుగోపాలరెడ్డి, అశోక్‌బాబులు సన్మానించారు. వీరి వెంట అశోక్‌బాబు సోదరుడు డాక్టర్ వరికూటి అమృతపాణి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కొండా శివప్రసాదరెడ్డి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి వీరభద్రుని శ్రీనివాసరెడ్డి, పార్టీ నాయకులు ఉన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి



కొల్లూరు : గ్రంథాలయ సేవలను విద్యార్థులతో పాటు గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి.సుబ్బరత్నమ్మ పేర్కొన్నారు. శనివారం కొల్లూరు శాఖా గ్రంథాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయం నుంచి అందుతున్న సేవలను పాఠకులను అడిగి తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రంథాలయాల ఉపయోగాలను ప్రజలలో అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలకు వచ్చేలా ప్రోత్సహించడంతో పాటు సభ్యత్వాలు తీసుకొనేలా సేవలను విస్తృతం చేయాలని సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించి గ్రంథాలయాధికారి వై.రాంబాబుకు పలు సూచనలు చేశారు.

ప్రాంగణ ఎంపికల్లో చలపతి ఫార్మశీ విద్యార్థుల ప్రతిభ



గుంటూరు రూరల్: లాం కళాశాలలో హైదరాబాదుకు చెందిన గ్లాండ్ ఫార్మా సంస్థ శనివారం ప్రాంగణ ఎంపికలను నిర్వహించింది. ఇందులో తమ కళాశాలకు చెందిన 33 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని చలపతి ఫార్మశీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులుతో పాటు శాంతికిరణ్, శ్రీమన్నారాయణ, రాజేంద్ర, వంశీకృష్ణరాజు తదితరులు అభినందించారు.

నిరుద్యోగ యువతకు ట్యాలీ కోర్సుల్లో ఉచిత శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు కడపలో ట్యాలీ, కంప్యూటర్ నైపుణ్యంపై ఉచిత శిక్షణ, ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధి హరిప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ పాస్, ఫెయిల్ అయిన 18 నుంచి 26 ఏళ్ల లోపు వయసు ఉన్న అభ్యర్థులకు కడపలో 35 రోజుల పాటు ఉచిత భోజన, వసతితో కూడిన శిక్షణ కల్పిస్తామని పేర్కొన్నారు. ట్యాలీ ప్లస్ జీఎస్టీ, స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్, కమ్యూనికేషన్, లైఫ్, ఇంటర్వ్యూ స్కిల్స్‌తో పాటు వర్క్ ప్లేస్ ఎథిక్స్‌పై అత్యుత్తమ శిక్షణ కల్పించి, శిక్షణానంతరం వివిధ సంస్థల్లో నెలకు రూ.15 వేలకు పైబడిన వేతనంతో నూరు శాతం ఉద్యోగాలను చూపిస్తామని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 90004 87423 నంబర్లో సంప్రదించాలని కోరారు.

ఈవీఎంలు సిద్ధం



పొన్నూరు : ఈ నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఇందులో భాగంగా నియోజక వర్గంలో 264 బూత్‌లలో ఓటింగ్ ప్రక్రియలో వినియోగించనున్న ఈవీఎంలు, వీవీప్యాట్లు సిద్ధమవుతున్నాయి. పట్టణంలోని సెయింట్ ఆన్స్ హైస్కూల్‌లో రిటర్నింగ్ అధికారి ఎ. లక్ష్మీకుమారి ఆధ్వర్యంలో నిపుణుల పర్యవేక్షణలో ఈవీఎంలలో బ్యాలెట్ పేపర్ అమరిక, వరుస క్రమంలో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల గుర్తులను ఏర్పాటులో తలమునకలై ఉన్నారు. ఎన్నికల బరిలో ఉన్న 14 మంది అభ్యర్థుల పర్యవేక్షణలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని సెక్టార్ అధికారులు, రూట్ అధికారులు ఆయా మండలాల ఏఆర్వోలు, ఎన్నికల సిబ్బంది తదితరులు పనిచేస్తున్నారు.

ధూళిపాళ్లవి చౌకబారు రాజకీయాలు

వైఎస్సార్ సీపీ పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ



అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: ధూళిపాళ్ల నరేంద్రవి చౌకబారు రాజకీయాలని పొన్నూరు వై సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ విమర్శించారు. హెలిప్యాడ్ ధ్వంసం ఘటనకు సంబంధించిన ఆరోపణల్లో నిజం లేదని కొట్టిపారేశారు. ఆ పార్టీ నేతలు పనిగట్టుకొని అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఎవరో కాంట్రాక్టర్ నిర్మించిన హెలిప్యాడ్‌ను అతి తక్కువ ధరకు దక్కించుకుని పర్మిషన్ పొందాలని ధూళిపాళ్ల ప్రయత్నించారన్నారు. ఆ పథకం ఫలించకపోవడంతో కుటిల రాజకీయాలకు తెర తీశాడని మండిపడ్డారు. పవన్ కల్యాణ్ పర్యటన నేపథ్యంలో హెలిప్యాడ్ అనుమతి దొడ్డిదారిన పొందాలని చూడటం సిగ్గు చేటన్నారు. పట్టణంలోని సజ్జ కళ్యాణ మండపం స్థలంలో టీడీపీ అభ్యర్థి ఎలాంటి హెలిప్యాడ్‌ను నిర్మించలేదని, ఎవరూ ధ్వంసం చేయలేదన్నారు. సంబంధిత కాంట్రాక్టరు నిర్మించిన హెలిప్యాడ్ స్థల యజమానితో చేసుకున్న ఒప్పందం పూర్తయిన క్రమంలో మెటీరియల్ తాను తీసుకుపోయాడని తెలిసిందన్నారు. సంబంధిత కాంట్రాక్టరుతో నరేంద్రకు బేరం కుదరనందునే ఈ సంఘటన జరిగిందన్నారు. ఈ సంఘటనకు తనకు ఎలాంటి సంబంధం లేదని ధూళిపాళ్ల దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. కాంట్రాక్టరు, ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ మధ్య రేటు విషయంలో జరిగిన అభిప్రాయ భేదమే కారణమై ఉండొచ్చన్నారు. కాంట్రాక్టర్ అడిగిన మొత్తాన్ని ఇవ్వడానికి అంగీకరించకుండా ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ నిరాకరించినట్లు తెలిసిందన్నారు.కూటమిలోని కీలకమైన జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పర్యటన కోసం ఒక హెలిప్యాడ్‌ను నిర్మించకుండా, ఇలా ఎదుటి వారిని నిందిస్తారా? అని మండిపడ్డారు. ఇలాంటి చౌకబారు రాజకీయాలు మానుకోవాలని అంబటి మురళీకృష్ణ హితవు పలికారు.

దేవదాయశాఖ బోర్డుల ధ్వంసం



ప్రత్తిపాడు: దేవాదాయశాఖ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డులను కొందరు గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేశారు. దీనిపై రామస్వామి ట్రస్టు ఈవో జె.వి. నారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోనికి వెళితే నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో వివాదంలో ఉన్న మదమంచి రామస్వామి ట్రస్టును కొద్ది నెలల కిందట దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ట్రస్టుకు ఈవోను కూడా నియమించారు. ఈ నేపథ్యంలో స్థలంలో దేవాదాయ దర్మాదాయ శాఖ బోర్డులను ఏర్పాటు చేసింది. కాగా ఇటీవల కొందరు గుర్తు తెలియని వ్యక్తులు నేల మట్టానికి కోసేసి వాటిని తొలగించారు. ఈ విషమై శనివారం ట్రస్టు ఈవో జె.వి. నారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వాడవాడలా ప్రచారాల హోరు

- గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకుల ఆధ్వర్యంలో జోరుగా సాగుతున్న ఎన్నికల ప్రచారాలు
- మద్దతు పలుకుతున్న ఆయా గ్రామాల ప్రజలు

రేపల్లె రూరల్: రానున్న సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని రేపల్లె పట్టణ, మండలంలోని వివిధ పంచాయతీలలో వాడవాడలా ప్రచార కార్యక్రమాలు శనివారం జోరుగా కొనసాగాయి. పట్టణంలో ఆయా వార్డుల కౌన్సిలర్‌లు, వార్డు ఇన్‌చార్జ్‌ల పర్యవేక్షణలోనూ గ్రామాలలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామ పార్టీ ఇన్‌చార్జ్‌ల ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గత ఐదు సంవత్సరాలు వైఎస్సార్ సీపీ పాలనలో ప్రజలు పొందిన లబ్ధిని, అభివృద్ధిని వివరించటంతో పాటు రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి తమ అమూల్యమైన ఓటువేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. రేపల్లె పట్టణంలోని 6వ వార్డులో రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు తనయుడు మోపిదేవి రాజీవ్, వార్డు ఇన్‌చార్జ్ ఆకిశెట్టి నాగరాజు, పేటేరు గ్రామంలో గ్రామ ఇన్‌చార్జ్ కనపర్తి రవికిరణ్‌లు విస్తృతంగా ప్రచారం నిర్వహించి బాపట్ల పార్లమెంటరీ అభ్యర్థి నందిగం సురేష్, రేపల్లె అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ ఈవూరు గణేష్‌లకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.



పట్టణంలోని 6వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న మోపిదేవి రాజీవ్, నాయకులు



పేటేరులో ప్రచారం నిర్వహిస్తున్న స్థానిక నాయకులు

జగనన్న పాలనలో అర్హులందరికీ సంక్షేమం



పిట్టలవానిపాలెం: రాష్ట్రంలో కుల, మతాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమాభివృద్ధి ఫలాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డిదే నని వైఎస్సార్ సీపీ నాయకులు, కోమలి సర్పంచ్ శ్యామల నాగిరెడ్డి అన్నారు. బాపట్ల వైఎస్సార్ సీపీ అభ్యర్థి కోన రఘుపతి గెలుపును కాంక్షిస్తూ కోమలి గ్రామ సచివాలయ పరిధిలోని ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రంలో సంక్షేమాభివృద్ధి కొనసాగుతుందని అన్నారు. నవరత్నాల పేరుతో రాష్ట్రంలో సంక్షేమం పరుగులు తీసిందని గుర్తు చేశారు. బాపట్ల శాసన సభ్యునిగా కోన రఘుపతిని మూడవసారి ఆశీర్వదించాలని కోరారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

సైడ్ డ్రైన్‌లోకి దూసుకుపోయిన ఆర్టీసీ బస్సు

ట్రాఫిక్ నిలిచిపోవడంతో ప్రయాణికుల పాట్లు



బస్టాండ్ సమీపంలో సైడ్ డ్రైన్‌లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

కొల్లూరు : ఇరుకు మార్గంలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొల్లూరు బస్టాండ్ సెంటర్ సమీపంలోని ఇరుకు మార్గంలో వాహనాలు ఎదురెదురుగా తారసపడితే ఎదురుగా వచ్చే వాహనానికి దారి ఇచ్చే క్రమంలో అదుపు తప్పి మురుగు కాల్వలోకి దూసుకువెళ్లడం నిత్యకృత్యంగా మారింది. తరచూ వాహనాలు సైడ్ డ్రైన్ లోకి దూసుకువెళ్లడంతో తెనాలి–రేపల్లె ప్రధాన మార్గంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడి ట్రాఫిక్ నిలిచిపోవడం పరిపాటిగా మారింది. శనివారం తెనాలి డిపోకు చెందిన కొత్తూరులంక బస్సు ప్రయాణికులతో తెనాలి వెళ్లే క్రమంలో ఎదురుగా వచ్చిన మరో బస్సుకు దారి ఇచ్చే ప్రయత్నంలో మురుగు కాల్వలోకి దూసుకువెళ్లింది. మురుగు కాల్వలో బస్సు కూరుకుపోవడంతో ప్రొక్లేన్ సాయంతో బస్సును బయటకు తీయడానికి సమయం పట్టింది. దీంతో ఆ మార్గంలో రాకపోకలు నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు.

ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా



భారీ ర్యాలీలో భాగంగా అంబటి వెంట గ్రామస్తులు

చేబ్రోలు: పొన్నూరును రాష్ట్రానికే ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చేబ్రోలు మండలం గొడవర్రు, గుండవరం గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా చోట్ల మహిళలు హారతులు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. రెండు గ్రామాల పరిధిలో ఎన్నికల ప్రచార రథంపై నుంచి ఆయన ప్రజలకు అభివాదం చేశారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు స్థానిక నాయకులతో కలిసి రెండు గ్రామాల పరిధిలో అంబటి మురళీకృష్ణ ముమ్మరంగా ప్రచారం నిర్వహించగా, ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. అడుగడుగునా ప్రచారాన్ని స్వాగతిస్తూ బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ తన నామినేషన్ కార్యక్రమానికి క్వారీ తిరునాళ్లను తలపించే విధంగా ప్రజల నుంచి అనూహ్య స్పందన వచ్చిందన్నారు. పెదకాకాని మండలం నంబూరు నుంచి పొన్నూరు వరకు బారీ ర్యాలీ జరిగిన తీరు చూడముచ్చటేసిందన్నారు. ఆ రోజు నుంచే ధూళిపాళ్ల నరేంద్రకు ఓటమి భయం పట్టుకుందని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. అందుకే ప్రజల్లోకి ప్రచారానికి రావడంలా ఇంటికే పరిమితమయ్యారని విమర్శించారు.

నరేంద్ర జైలుకెళ్లడం ఖాయం

16 క్రిమినల్ కేసులు, స్కామ్ లలో ప్రమేయం ఉన్న నరేంద్ర జైలుకు వెళ్లటం ఖాయమని అంబటి అన్నారు. ఆలీబాబా 40 దొంగల్లా ఏదో రోజు నియోజకవర్గాన్ని వదిలి పారిపోవచ్చునన్నారు. సంగం డెయిరీని అడ్డుపెట్టుకొని కోట్ల రూపాయిలు దోచుకున్న ఘనుడు ధూళిపాళ్ళ అని ఆరోపించారు. గ్రామదేవత సాక్షిగా నీతిమంతమైన పాలన సాగిస్తానని అంబటి ప్రకటించారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య, ఎమ్మెల్యే అభ్యర్థి అయిన తనకు విజయం చేకూర్చాలని గ్రామస్తులను అభ్యర్థించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బొర్రు రామారావు, తోట వీరభద్రయ్య, ఆరాద్యుల శ్రీనివాసరావు, బత్తుల వెంకటేష్, షేక్ కరీముల్లా, హుస్సేన్, డి అక్కిరెడ్డి, కొమ్ము రాంబాబు, కాకాని రమేష్, గుండవరం గ్రామానికి చెందిన పార్టీ నాయకులు చుక్కా నాగబాబు, గుంటూరు శ్రావణి, శివన్నారాయణ, తుపాకుల శివయ్య, మక్కె నాగబాబు, వెంకటేష్, చుక్కా రాజబాబు, శేఖర్‌బాబు, తుపాకుల రామయ్య, బాష్యం చెంచుబాబు తదితరులు పాల్గొన్నారు.